జేఎన్‌టీయూహెచ్‌లో హోలీ వేడుకల్లో విద్యార్థినీవిద్యార్థులు

హోలీ.. రంగుల కేళీ..

ఆల్విన్ కాలనీ డివిజన్‌లో హరివిల్లు వాసులు..

జగద్గిరిగుట్టకు చెందిన వాకర్స్‌బృందంతో బీజేపీ నేత శేఖర్‌యాదవ్

హోలీ వేడుకల్లో జగద్గిరిగుట్ట కాంగ్రెస్ నేతలు వరమ్మ, ఐలయ్య, తదితరులు

మియాపూర్, కొండాపూర్, కేపీహెచ్‌బీ కాలనీ, కుత్బుల్లాపూర్, మార్చి 25 : శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో హోలీ వేడుకలను ప్రజలు సందడిగా జరుపుకున్నారు. సోమవారం హోలీ సందర్భంగా సహజ సిద్ధమైన రంగులు చల్లుకుంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చిన్నా పెద్దా తేడాలేకుండా యువతీ యువకులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నేతలు ఈ వేడుకల్లో పాల్గొని ఆటపాటలతో సందడిగా గడిపారు. గేటెడ్ కమ్యూనిటీలు , కాలనీలు, బస్తీల్లో వేడుకలను సంబురంగా జరుపుకుని మిఠాయిలు పంచుకున్నారు. సినిమా గీతాలకు స్టెప్పులేస్తే చిన్నాపెద్దా అంతా కలిసి నృత్యాలు చేశారు.

– ప్రజలందరి జీవితాల్లో హోలీ ఆనందాన్ని నింపాలని మెరుగైన జీవనప్రమాణాలతో సాగాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ ఆకాంక్షించారు. మున్సిపల్ కార్మికులు, బీఆర్ఎస్ నేతలతో ఆయన హోలీలో పాల్గొనగా పలువురు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.



జగద్గిరిగుట్ట హోలీ వేడుకల్లో బీఆర్ఎస్ శ్రేణులు, స్థానికులు

కేపీహెచ్‌బీ కాలనీ : హోలీ వేడుకల్లో చిన్నారులు

కుత్బుల్లాపూర్ : మున్సిపల్ కార్మికులతో ఎమ్మెల్యే వివేకానంద్

శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల పరిధిలో హోలీ ఆడుతున్న పలువురు

చింతల్‌లో కామదహనం..

■ ఆశీష్ సాహిత్య సమాజ సేవా ట్రస్ట్ లోగో ఆవిష్కరణ..



కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్ కేంద్రంలో రచయిత్రి మొండ్రేటి సత్య వీణా స్థాపించిన ఆశీష్ సాహిత్య సమాజ సేవా ట్రస్ట్ లోగోను, రామంభజే పుస్తకాన్ని సివిల్ కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ అంజనీ కుమారి, గనులశాఖ విశ్రాంత డైరెక్టర్ వి.వేణుగోపాల్‌లు ఆవిష్కరించారు. సమాజంలోని పేద విద్యార్థులకు సహాయాన్ని అందించేందుకు సేవా ట్రస్ట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గంట మనోహర్‌రెడ్డి, దీపక్ న్యాతి, సాధనాల వెంకట స్వామి, రామకృష్ణ, చంద్రమౌళి, రామారావు, సూర్యప్రకాష్‌రావు, వర్ల వేణుగోపాల్, రాంబాబు, ఆశీష్, విజ్ఞత్, అనీష్, శైలజ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 25

■ నడకతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రతి రోజు నడక, వ్యాయామం, యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్య వంతులుగా జీవించవచ్చని రెయిన్‌బో విస్తాస్ రాక్ గార్డెన్ అధ్యక్షుడు బండి మధుసూదన్‌రెడ్డి అన్నారు. గేటెడ్ కమ్యూనిటీల ఐక్యత కోసం రెయిన్‌బో విస్తాస్ రాక్ గార్డెన్, మెరినా స్కైవాక్ కమ్యూనిటీల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 5,3కే రన్ పోటీలను మధుసూదన్‌రెడ్డి, సైబర్ సిటీ వంశీకృష్ణారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నగరంలో నివసిస్తున్న ప్రజలంతా చక్కని ఆరోగ్యం కోసం ప్రతి రోజు నడకకు సమయాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పురుషులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులను అందించారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 25

■ ఉచిత వైద్య శిబిరం..

హైదర్‌నగర్ డివిజన్ , కిందికుంట పార్కులో పిక్కెల్ ఐ దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరానికి వచ్చిన ప్రజలకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్లు అబ్దుల్ రషీద్, కృష్ణ, పూజిత, వాకర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

– మియాపూర్, మార్చి 25

ఘనంగా సిద్ధిచామ్స్ పాఠశాల వార్షికోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్ బ్రాంచ్ సిద్ధిచామ్స్ పాఠశాల మొదటి వార్షికోత్సవం (గ్రాడ్యూయేషన్ డే) వేడుకలు సందడిగా సాగాయి. సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన అరుణ అశోక్, సౌజన్య, ఉషాలు మాట్లాడుతూ... విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని, చిన్నారుల్లో దాగిఉన్న ప్రతిభను పాఠశాల దశలోనే గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ప్రతిభను చాటిన చిన్నారులకు బహుమతులను అందించారు. ఈ వేడుకల్లో యూకేజీ విద్యార్థులు ఆటపాటలలో సందడిగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 25

మానసిక వికలాంగులకు చేయూత

సాధన ఇనిస్టిట్యూట్ ప్రతినిధులకు చెక్‌ను అందజేస్తున్న నవద్వీప ఫౌండేషన్ సభ్యులు

కొండాపూర్, మార్చి 25 : మానసిక వికలాంగుల చేయూతకు తమ వంతుగా హైటెక్‌సిటీలోని మైహోం నవద్వీప ఫౌండేషన్ రూ. 6లక్షల ఆర్థిక సాయాన్ని సోమవారం నాచారంలోని సాధన ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ చాలెంజ్‌డ్ హోంకు అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. మానసిక వికలాంగ చిన్నారులకు ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం కోసం ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. సాధన ఇనిస్టిట్యూట్‌లో ప్రత్యేక శిక్షణ కోసం 400ల ఎస్ఎఫ్‌టీతో ప్రత్యేక గది నిర్మాణానికి అవసరమైన మొత్తాన్ని మంత రమేశ్ చేతుల మీదుగా చెక్ రూపంలో అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డాక్టర్ రమణబాబు, డాక్టర్ రామ మోహన్‌రావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, రవి గంటి, వెంకయ్య, వర్ధన్‌రావులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా సంజీవరెడ్డి

మియాపూర్, మార్చి 25:శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నల్లా సంజీవ రెడ్డి నియామకమయ్యారు. గౌరవాధ్యక్షుడిగా కృష్ణను నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్‌ల చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందకున్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ సహా జిల్లా పార్టీ నేతలు, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ డాక్టర్‌కు తీవ్రగాయాలు

గాయపడిన విఘ్నేష్

దుండిగల్,మార్చి25: వేగంగా దూసుకువచ్చిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు మూలమలుపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టగా.. డివైడర్ రాళ్లు ఎగిరి రోడ్డుపై అటుగా బైక్‌పై వెళ్తున్న ఆర్ఎంపీ డాక్టర్‌కు తగిలి అతనికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...దుండిగల్ మున్సిపాలిటీ పరిధి,గండిమైసమ్మచౌరస్తా వద్ద క్లీనిక్ నడుపుతున్న విఘ్నేష్ ఆర్ఎంపీ డాక్టర్ సోమవారం ఉదయం బైక్‌పై షాపూర్‌నగర్‌కు వెళ్లి.. తిరిగి గండిమైసమ్మ వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో బహదూర్‌పల్లి,శ్రీరాంనగర్ మూలమలుపు వద్దకు రాగానే.. ఎదురుగా వేగంగా దూసుకువచ్చిన ఆర్‌కే ట్రావెల్స్‌కు చెందిన బస్సు(టీఎస్07యూబీ-2223) డివైడర్‌ను ఢీ కొనడంతో డివైడర్ రాళ్లు ఎగిరి విఘ్నేష్‌తో పాటు బైక్‌కు తలగడంతో అతను రోడ్డుపై పడిపోయాడు. తీవ్ర గాయాలైన అతడిని చికిత్స కోసం ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్ కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 25 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో సోమవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ.11, వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జిమిర్చి 35, కాకరకాయ 45, బీరకాయ 35, క్యాబేజి 19, ఫ్రెంచ్ బీన్స్ 50, క్యారెట్ 19, కాలీఫ్లవర్ 18, దొండ 17, చిక్కుడు 50, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 19, క్యాప్సికం 70, ఆలుగడ్డ 25, కీరా 23, దోసకాయ 18, సొరకాయ 9, పొట్లకాయ (1) 18, కందగడ్డ 60, ఉల్లిపాలక 35, ఉల్లిగడ్డ 19, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 35, ముళ్లంగి (1) 4 నుంచి 6, మొరంగడ్డ 15, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 55 నుంచి 60, మునగకాయ(1) 5 నుంచి 6, పచ్చి బఠానీ 53, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 200, అల్లం 160, వెల్లుల్లి 180, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీరు

- మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలి
- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మంచి నీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, మార్చి 25: పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ ప్రధాన గేట్ నుంచి కల్వరి టెంపుల్ వద్ద ఉన్న రిజర్వాయర్ వరకు రూ. 40 కోట్ల వ్యయంతో చేపడుతున్న మాంజీరా మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీపడకుండా పనులను చేయాలని అధికారులకు సూచించారు. మంజీరా రోడ్డులో పాత పైప్‌లైన్ 1960లో వేయడం వల్ల.. ప్రస్తుతం లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతున్నాయని అన్నారు. లీకేజీల వల్ల రోడ్లు దెబ్బతినడంతో చుట్టు ప్రక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సమస్యపై అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి నిధులు కేటాయించారని అన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరడం సంతోషంగా ఉందన్నారు. ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీరును అందించమే తమ ధ్యేయమన్నారు. పాత పైప్‌లైన్‌ల స్థానంలో కొత్త పైప్‌లైన్ పనులను వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు..

అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజలో డిప్యూటీ మేయర్ దంపతులు

శివాలయంలో అయ్యప్ప పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

దుండిగల్,మార్చి 25: శ్రీహరిహరపుత్ర అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సోమవారం వైభవంగా జరిగాయి. నిజాంపేట్ శ్రీనివాస్‌నగర్‌లోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్ కుటుంబసభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలో కార్పొరేటర్ ప్రణయయాదవ్, మాజీ సర్పంచ్ ప్రమీల సాయిలు యాదవ్, గురుస్వామి వెంకట్‌రెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బాలానగర్‌లో..

బాలానగర్, మార్చి 25 : అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఫతేనగర్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అయ్యప్పస్వామి పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి పూజలు..

హఫీజ్‌పేట్ డివిజన్, హుడా కాలనీలో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి లలితా నగరేశ్వర దేవాలయంలో ప్రథమ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం జరిగిన వేడుకలకు శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్ గౌడ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు.

– మాదాపూర్, మార్చి 25

నేడు బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

మణికొండ, మార్చి 25: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి నాయకులు,కార్యకర్తల సమావేశాన్ని నేడు నార్సింగ్‌లోని ఓం కన్వెన్షన్‌లో ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు మండల మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అధ్యక్షతన పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌తో పాటు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధు లు, బీఆర్ఎస్ నేతలు ,కార్యకర్తలు హాజరుకానున్నారు.

ప్రశాంత వాతావరణంలో .. ఎన్నికలు జరిగేలా చర్యలు

హిమాయత్‌నగర్,మార్చి25: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం నారాయణగూడ పీఎస్ పరిధిలోని హిమాయత్‌నగర్, దత్తాత్రనగర్,జనార్దన్‌బాడ, గాంధీ కుటీర్, నారాయణగూడ తదితర ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సుల్తాన్ బజార్ ఏసీపీ కె.శంకర్,నారాయణగూడ పీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు సున్నితమైన ప్రాంతాలను గుర్తించి ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పీఎస్ పరిధిలోని 40 పోలింగ్ బూత్‌ల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.